అలీకేఫ్ చౌరస్తాలో గులాబీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

దారులన్నీ ఎల్కతుర్తి వైపే ..

నియోజకవర్గం నుంచి 4 వేల గులాబీ దండు సిద్ధం

చరిత్రలో నిలిచే విధంగా గులాబీ బహిరంగ సభ

జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట/ గోల్నాక, ఏప్రిల్ 26: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలి వెళ్లేందుకు అంబర్‌పేట నియోజకవర్గం గులాబీ దండు సర్వం సిద్ధమైంది. ఆదివారం నియోజకవర్గం నుంచి కనీసం 4 వేల మందికి పైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను తరలివెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ మేరకు పార్టీ నాయకులు వాహనాలు, భోజనం ఇతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే అంబర్ పేట నియోజకర్గంలోని ప్రధాన ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లతో గులాబీమయంగా మారిపోయింది. దీంతో ఒక్క రోజు ముందే గులాబీ రెపరెపలతో బీఆర్ఎస్ జెండా మురిసింది..శనివారం అంబర్ పేట అలీకేఫ్ చౌరస్తా వద్ద ఘనంగా గులాబీ జెండా పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది బీఆర్ఎస్ నాయకులతో కలసి హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ .. ముందుగా అక్కడ జ్యోతిరావుపూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళుర్పించారు. అనంతరం బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించి భారీ కేక్ కట్ చేసి బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ... ఆదివారం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రజతోత్సవ భారీ బహిరంగ సభకు ఎవరు ఎక్కడున్నా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అంబర్ పేట గులాబీ దండు బలమెంతో చూపుతూ దారులన్ని ఎల్కతుర్తి వైపే సాగాలని ఆయన పిలుపు నిచ్చారు. అది చూసి కాంగ్రెస్ దిమ్మెతిరిగి పోవాలన్నారు. బీఆర్ఎస్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్కతుర్తి రజతోత్సవ సభ వైపు యావత్ దేశం ఎదురు చూస్తోందని అన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి సర్కార్‌పై ప్రజలకు నమ్మకం పోయిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన అనేక పథకాలు తమకు అందడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వాన్ని సబ్బండవర్గాలు కోరుకుంటున్నాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను చూసి మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు శిరీషయాదవ్, ఓంప్రకాశ్ యాదవ్, సిద్ధార్థ్ ముదిరాజ్, భూపతి లక్ష్మణ్, పులిజాల గెల్వయ్య, ఎర్రబోలు నరసింహా రెడ్డి, మోర శీరాములు ముదిరాజ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


అలీకేఫ్‌చౌరస్తాలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

రజతోత్సవ సభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులకు నిరసనగా షేక్‌పేటలోని వెస్టర్న్ ప్లాజా వాసులు కొవ్వొత్తుల ర్యాలీని ర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి నివాళులర్పించారు. ఈ ర్యాలీలో మారుతీ కుమార్, సాయి కుమార్ పాల్గొన్నారు. – షేక్‌పేట

చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

మెహిదీపట్నం, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ రజతోత్సవ సభను నిర్వహించడానికి పార్టీ అధ్యక్షుడు కే చంద్రశేఖరరావు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం రాత్రి నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో చలో వరంగల్ పోస్టర్లను ఆయన మెహిదీపట్నం డివిజన్ అధ్యక్షుడు మెట్టు నటరాజ్, నాయకులు ప్రదీప్‌కుమార్‌అగర్వాల్, చింతల అశోక్‌ముదిరాజ్, శ్రీశైలంగౌడ్‌లతో కలిసి ఆవిష్కరించారు. మహా సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు అభినందన సభ

విద్యార్థులను అభినందిస్తున్న ఆల్ఫోర్స్ కళాశాల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

అంబర్ పేట, ఏప్రిల్ 26: అల్ఫోర్స్ విద్యా సంస్థలు ఆరంభం నాటి నుండి విద్యార్థులకు అత్యుత్తమ విద్యతోపాటు అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ విద్యలో రారాజుగా నిలుస్తున్నదని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి తెలిపారు. నల్లకుంటలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో శనివారం సాయంత్రం విద్యార్థులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. నల్లకుంట అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు సైతం అత్యుత్తమ ఫలితాలను సాధించారని చెప్పారు. చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యకీర్తి నిత్యధామం కూచిపూడి నృత్య కళాశాల గురు బాలాజీకుమార్ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యహేళ శీర్షికన నాల్గవ వార్షికోత్సవాలు శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. నాట్యగురువు డా.వనజ ఉదయ్, సభ్యత్వ స్యూల్ కరస్పాండెంట్ లక్ష్మి తదితరులు వక్తలుగా విచ్చేశారు. విద్యార్థులు తమ అందెల రవళితో ప్రేక్షకులను సమ్మోహన పరిచారు. 200 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. – రవీంద్రభారతి

రాష్ట్ర పోలీస్ వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపు

పహాడిషరీఫ్, ఏప్రిల్ 26: దేశంలో రాష్ట్ర పోలీస్ వ్యవస్థ ప్రత్యేక గుర్తింపు సాధించిందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. నేర నియంత్రణకు నిఘా నేత్రం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వై ఏ ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం సీపీ సుధీర్ బాబు 855, సీసీ కెమెరాలను ప్రారంభించి, మాట్లాడారు. మహేశ్వరం జోన్ డీసీపీ సునీతరెడ్డి, అడిషనల్ డీసీపీ, సత్యనారాయణ, ఏసీపీలు లక్ష్మి కాంత్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

చైర్మన్ జనార్దన్‌కు వినతిపత్రం ఇస్తున్న స్వరూప, గుజ్జ కృష్ణ

కాచిగూడ, ఏప్రిల్ 26: విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదించాలని సోషల్ డెమోక్రటిక్ జేఏసీ చైర్మన్ కోల జనార్దన్ డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలోని జేఏసీ కార్యాలయంలో గుజ్జ కృష్ణ, జి. స్వరూప సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ మహిళ రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భావనిరెడ్డి, వన్నాడ రమ్య, వి. నరసింహ, రోజా తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలపై సమావేశం

జియాగూడ, ఏప్రిల్ 26 : రాష్ట్రంలోని వైద్యుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నరహరి, డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఏంకే రావుఫ్ డిమాండ్ చేశారు. శనివారం కోఠి లోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం 2వ జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వైద్యులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అలవెన్సులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ దీన్ దయాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

కాచిగూడ, ఏప్రిల్ 26: వ్యక్తి ఆత్మహత్య పాల్పడిన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. సీఐ తల్లోజు జోత్స్న, డీఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. కాచిగూడలోని ఫాతిమానగర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ సత్తార్(45) ఆటో డ్రైవర్‌కు మూడేళ్లుగా భార్యా పిల్లలు దూరమయ్యారు. దీంతో మనస్థాపం చెందిన సత్తార్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఐరన్ రాడుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గోల్కొండలో మరో వ్యక్తి ..

మెహదీపట్నం : కుటుంబ కలహాల కారణంగా ఒక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గోల్కొండ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మోతీదర్వాజ సమీపంలో ఉండే ఇబ్రహీం (40) అమెజాన్లో డెలివరీబాయ్. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఇంట్లో రాడ్డుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వృద్ధుడు మృతి

కాచిగూడ : కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(55)శంషాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం చివర్లో ఆరోగ్యంతో ఉంటూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని ఒంటిపై నీలిరంగు చొక్క, నలుపు రంగు ప్యాంటు ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాది పురస్కారాలు ప్రదానం

అవార్డు గ్రహీతలతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

రవీంద్రభారతి,ఏప్రిల్ 26 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ,శ్రుతిలయ ఫౌండేషన్–సీల్‌వెల్ కార్పొరేషన్ ,ఆదర్శ ఫౌండేషన్ అభినందనలతో రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో ఎస్పీ జానకి జన్మదినం సందర్భంగా ఉగాది పురస్కారాలు, సీల్‌వెల్ సుస్వరాలు 73 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, శ్రుతిలయ ఎండీ భొక్క భీమ్‌రెడ్డి, శ్రుతిలయ ప్రధాన కార్యదర్శి గాయన ఆమని విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పలువురు సమాజసేవకులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు.

ప్రజలంతా బీఆర్ఎస్ వైపు


కార్వాన్‌లో పాదయాత్ర చేస్తున్న ఠాకూర్ జీవన్ సింగ్ తదితరులు

కార్వాన్, ఏప్రిల్ 26 : ప్రజలంతా బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని కార్వాన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్ సింగ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆదివారం వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆయన ముత్యాల భాస్కర్‌తో కలిసి కార్వాన్‌లో పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో లక్పతి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సృజన వంకా కూచిపూడి..

రవీంద్రభారతి : నృత్యగురువు మాజీ సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికరెడ్డి శిష్యురాలు సృజన వంకా కూచిపూడి రంగ ప్రవేశం శనివారం రవీంద్రభారతిలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వక్తలుగా బీసీ రాయ్ అవార్డు గ్రహీత డాక్టర్ పి. రఘురామ్,ప్రొఫెసర్ పి.జె. నారాయణ, హెచ్ఓడీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డాన్స్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ అరుణ్‌భక్షి తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి సృజన వంకా కూచిపూడి రంగ ప్రవేశాన్ని ప్రారంభించారు. నాట్యగురువులు, సృజన తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు ఊహించని స్పందన

అంబర్‌పేట, ఏప్రిల్ 26 : వరంగల్ లో నేడు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అన్ని వర్గాల నుంచి ఊహించని స్పందన వస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పులిజాల గెల్వయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట అన్ని డివిజన్ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున ఈ సభకు వచ్చేందుకు సిద్ధమయ్యారని తెలిపారు.

వరంగల్ సభకు భారీ ఎత్తున కార్యకర్తలు

కాచిగూడ, ఏప్రిల్ 26: సీఎం రేవంత్ రెడ్డి మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతూ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాడని కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కె. సదానంద్ అన్నారు.శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. నేడు వరంగల్ లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభకు కాచిగూడ డివిజన్ నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు బయలుదేరుతున్నట్లు తెలిపారు.